



పాలమూరులో సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతూ సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచంద్‌రెడ్డి పేరుతో వెలిసిన హోర్డింగు



టీటీడీ మాజీ సభ్యుడు మన్నె జీవన్‌రెడ్డి పేరుతో మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన హోర్డింగు



బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ పేరుతో ఏర్పాటైన హోర్డింగ్

పార్లమెంటు ఎన్నికల సందడి

- పోటాపోటీగా వెలిసిన హోర్డింగులు
- ఊపందుకున్న నాయకుల సమావేశాలు, పర్యటనలు
- మన్నెజీవన్‌రెడ్డి హోర్డింగులపైనే సర్వత్రా చర్చ

మహబూబ్‌నగర్, జనవరి 12 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): పాలమూరులో పార్లమెంట్ ఎన్నికల సందడి మొదలైంది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో సత్తాచాటాలని భావిస్తోన్న ప్రధాన పార్టీలు, అభ్యర్థిత్వం ఆశిస్తోన్న నాయకుల హడావిడి కొనసాగుతోంది. మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గంపై దృష్టి సారించిన ఆశావహులు దూకుడు పెంచారు. ఒకవైపు టికెట్ కోసం అధిష్ఠానంతో, ముఖ్య నాయకులతో సంబంధాలు కొనసాగిస్తూ, మరోవైపు నియోజకవర్గంలో పలు కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు.

పండుగ శుభాకాంక్షలతో..

మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గంలో రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రయత్నిస్తోన్న కీలక నాయకులు సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలుపుతూ పోటాపోటీగా హోర్డింగులు ఏర్పాటు చేశారు. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని జిల్లా కేంద్రాలు, పట్టణాలు, మండల కేంద్రాల్లో శుభాకాంక్షల హోర్డింగులను పెద్ద సంఖ్యలో ఏర్పాటు చేయడంతో అందరి దృష్టి వీటిపైనే పడింది. మహబూబ్‌నగర్ లోక్‌సభ నుంచి బీజేపీ టికెట్ ఆశిస్తోన్న మాజీ మంత్రి, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, కాంగ్రెస్ టికెట్ ఆశిస్తోన్న ఆ పార్టీ సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానిత సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి, అవకాశమొస్తే ఎంపీగా బరిలో నిలిచేందుకు ప్రయత్నిస్తోన్న ప్రముఖ పారిశ్రామికవేత్త, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు మన్నె జీవన్‌రెడ్డి ఈ హోర్డింగులు ఏర్పాటు చేశారు. వీరు హోర్డింగులను ఏర్పాటు చేయడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

అవకాశమిస్తే ఎంపీగా పోటీ

టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు మన్నె జీవన్‌రెడ్డి సంక్రాంతి శుభాకాంక్షలు చెబుతూ మహబూబ్‌నగర్ లోక్‌సభ పరిధిలో వేయించిన హోర్డింగులు చర్చనీయాంశం అయ్యాయి. జీవన్‌రెడ్డి చిన్నాన్న ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ఇప్పటికీ బీఆర్ఎస్‌లోనే కొనసాగుతున్నారు. కానీ జీవన్‌రెడ్డి హోర్డింగులలో బ్యాక్‌గ్రౌండ్‌లో త్రివర్ణంతో పాటు, జీవన్ ఒక్కరి ఫొటో తప్ప వేరే ఏ నాయకుడి ఫొటో లేకపోవడంపై పలు రకాల చర్చ కొనసాగుతోంది. సీఎం రేవంత్‌రెడ్డితో జీవన్‌రెడ్డికి సన్నిహిత సంబంధాలు ఉండటంతో పాటు కాంగ్రెస్ అవకాశమిస్తే జీవన్‌రెడ్డి ఎంపీగా పోటీ చేస్తారనే చర్చ ఇటీవల సాగిన నేపథ్యంలో ఈహోర్డింగులపై సర్వత్రా ఆసక్తి కనిపిస్తోంది. ఎంపీగా అవకాశమొచ్చినా.. రాకపోయినా కాంగ్రెస్ ద్వారా జీవన్‌రెడ్డి రాజకీయాల్లో కొనసాగడం ఖాయమనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది.

పెరిగిన సమావేశాల జోరు

పార్లమెంటు ఎన్నికలకు ఇంకా మూడు నెలల గడువున్నప్పటికీ ప్రధాన పార్టీలు ఈ ఎన్నికలపై ఇప్పటికే దృష్టి సారించాయి. అసెంబ్లీ ఎన్నికల్లో పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో అప్రతిహత విజయాలు నమోదు చేసిన కాంగ్రెస్.. అదే ఊపుతో పార్లమెంట్ సీటును గెలవాలనే లక్ష్యంతో దూసుకెళుతోంది. సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉండటంతో గెలవడమే ఏకైక లక్ష్యంగా ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు సిద్ధమయ్యారు. పార్టీలో అత్యున్నత హోదాలో ఉన్న వంశీచంద్‌రెడ్డికే దాదాపు టికెట్ వస్తుందనే సమాచారం ఆ పార్టీ వర్గాల్లో చక్కర్లు కొడుతోంది. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్ష అనంతరం నియోజకవర్గంలో వంశీచంద్‌రెడ్డి కార్యాచరణలో దూకుడు పెరిగింది. సమావేశాలు, కార్యక్రమాలకు ఆయన విధిగా హాజరవుతుండటం పోటీకి ఆయన సిద్ధమవుతున్న వాతావరణాన్ని సూచిస్తోంది. మరోవైపు గత ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేసి, ద్వితీయ స్థానంలో నిలిచిన డీకే అరుణ సైతం మరోసారి బరిలో నిలవాలనే ఉద్దేశంతో నియోజకవర్గంలో కలియదిరుగుతున్నారు. కేంద్ర ప్రభుత్వ మన సంకల్పం-వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో, కేంద్ర ప్రభుత్వ కార్యక్రమాలలో పాల్గొనడంతో పాటు, క్షేత్రస్థాయి నాయకులతో ఆమె సమావేశాలు నిర్వహిస్తూ వస్తున్నారు. అదే పార్టీలో టికెట్ ఆశిస్తోన్న మాజీ ఎంపీ, పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి సైతం మరోవైపు నియోజకవర్గంలో పర్యటనల ఉధృతి పెంచారు. క్యాడర్‌తో అనుసంధానమవుతూ నియోజకవర్గాన్ని చుట్టేస్తున్నారు. ఆ పార్టీలో టికెట్ ఆశిస్తోన్న పార్టీ రాష్ట్ర కోశాధికారి బి.శాంతకుమార్ సైతం ఈసారి టికెట్ కోసం ప్రయత్నిస్తున్నారు. ఆయన పార్టీ చేపట్టిన వికసిత సంకల్ప యాత్రలో, పార్టీ క్యాడర్‌తో సమావేశాల్లో పాల్గొంటున్నారు. డోర్ స్టిక్కర్లు, పార్టీ ప్రచార పత్రాలను పంపిణీ చేస్తున్నారు.

కార్యకర్త మృతికి కూనంనేని నివాళులు


నివాళులు అర్పిస్తున్న సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని, జాతీయ నాయకుడు నారాయణ

వడ్డేపల్లి, జనవరి 12: జోగుళాంబ గద్వాల జిల్లా శాంతినగర్ పట్టణానికి చెందిన సీపీఐ కార్యకర్త రాజ్‌కుమార్ మూడు రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఆ పార్టీ ఎమ్మెల్యే కూనంనేని శుక్రవారం శాంతినగర్‌కు వచ్చి, కార్యకర్త చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో మంచి కార్యకర్తను కోల్పోయామని అన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. పార్టీ జాతీయ నాయకుడు నారాయణ నివాళులు అర్పించి, కుటుంబానికి రూ.5 లక్షల చెక్కును అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు పూర్ణచందర్‌రావు, రాంబాబు, సుబ్బారావు, చిన్నిబాబు, గోవిందు, అంజనేయులు, ఆశన్న ఉన్నారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

- కేంద్ర ప్రభుత్వ జలశక్తి శాఖ జాయింట్ సెక్రటరీ రాజ్‌కుమార్ మిశ్రా


మాట్లాడుతున్న రాజ్‌కుమార్ మిశ్రా

వెల్దండ, జనవరి 12: గ్రామీణ ప్రాంత మహిళలు అన్ని రంగాల్లో రాణించి, ఆర్థిక శక్తిగా ఎదగడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర జలశక్తి శాఖ జాయింట్ సెక్రటరీ రాజ్‌కుమార్ మిశ్రా అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండలో శుక్రవారం మన సంకల్పం-వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా గ్రామ సభ నిర్వహించారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్ మిశ్రా పాల్గొని మాట్లాడారు. కేంద్ర పథకాలను ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకునేలా అధికారులు, ప్రభుత్వ యంత్రాంగం చైతన్య పర్చాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రం, రాష్ట్రాల భాగస్వామ్యంతో పారిశుధ్య కార్యక్రమాలు, ఆర్థిక సేవలు, ఎల్‌పీజీ కనెక్షన్‌లు, పేదలకు గృహాలు, ఆహారభద్రత వంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. పోషకాహారం, ఆరోగ్య సంరక్షణ, స్వచ్ఛమైన తాగునీరు, నాణ్యమైన విద్యను అందుబాటులో ఉంచడమే కేంద్రం లక్ష్యమన్నారు. 2047 నాటికి భారత్ లక్ష్యాలను అధిగమించి, ఒక ప్రబల శక్తిగా మారనుందన్నారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా రూ.ఐదు లక్షల వరకు ఆరోగ్య సంరక్షణ, జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి తాగునీరు అందిస్తున్నట్లు చెప్పారు. రైతులకు పీఎం కిసాన్ ద్వారా స్వల్పకాలిక రుణాలు అందిస్తున్నామన్నారు. అంతకు ముందు ప్రధాని మోదీ సందేశాన్ని ఎల్‌ఈడీ తెరపై ఆయన స్థానికులతో కలిసి వీక్షించారు. వివిధ శాఖల స్టాల్స్‌ను సందర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి, నాబార్డ్ డీడీఎం నిఖిల్‌పాండే, ఎస్‌బీఐ ఆర్ఎం వెంకట్‌నారాయణ, డీఆర్‌డీవో నర్సింగ్‌రావు, నోడల్ అధికారి కౌశల్‌పాండే, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దళితబంధు పేరుతో.. దగా

- ఎన్నికల ముందు నియోజకవర్గానికి 1,100 యూనిట్ల కేటాయింపు
- లబ్ధిదారులను ఎంపిక చేసి.. అధికారులకు దరఖాస్తుల అప్పగింత
- ఆ సమయంలో ఒక్కొక్కరి నుంచి రూ.30 వేల నుంచి రూ.2 లక్షల వరకు వసూలు
- బీఆర్ఎస్ ఓడిపోవడంతో తామిచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలంటున్న బాధితులు
- ఇప్పటికే పలు చోట్ల ఆందోళనలు

గద్వాల/వనపర్తి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం దళితుల ఆర్థిక స్వావలంబన, ఉపాధి కోసం దళితబంధు పథకానికి శ్రీకారం చుట్టిన విషయం తెలిసిందే. ఈ పథకం కింద మొదటి విడతలో రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గానికి 200 యూనిట్ల చొప్పున మంజూరు చేశారు. ఆ సమయంలో నియోజకవర్గాల్లో ఈ పథకం లబ్ధిదారుల నుంచి రూ.లక్షల్లో వసూళ్లు చేశారని ఆరోపణలు వచ్చాయి. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సైతం ఓ సందర్భంలో దళితబంధు ద్వారా బీఆర్ఎస్ నాయకులు డబ్బులు వసూలు చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆ తర్వాత కొన్నాళ్ల పథకానికి బడ్జెట్‌లో నిధులు కేటాయించినప్పటికీ.. లబ్ధిదారులను ఎంపిక చేయలేదు. దీంతో ఆయా వర్గాల నుంచి ఒత్తిడి పెరగడం, ఎన్నికలు సమీపిస్తుండటంతో గత ప్రభుత్వం నియోజకవర్గానికి 1100 యూనిట్ల చొప్పున మంజూరు చేసి.. ఎమ్మెల్యేల ద్వారా ఎంపిక ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. ఈ క్రమంలో తమకు వచ్చిన యూనిట్ల ఆధారంగా మండలాలు, గ్రామాల వారీగా లబ్ధిదారులను ఎంపిక చేయాలని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులకు ఎమ్మెల్యేలు ఆదేశాలు ఇచ్చారు. అయితే ఈ పథకం కింద ఒక్కో లబ్ధిదారుడికి రూ.10 లక్షలు ఏకబిగిన లబ్ధి చేకూరనుండటం, లబ్ధిదారుల నుంచి పోటీ ఎక్కువగా ఉండటంతో నాయకులు వసూళ్ల పర్వానికి శ్రీకారం చుట్టారు. కొందరు తమ అనుచరులను లబ్ధిదారులుగా ఎంపిక చేయగా, మెజారిటీ లబ్ధిదారుల నుంచి రూ.30 వేల నుంచి మొదలుకుని.. రూ.2 లక్షల వరకు వసూళ్లకు పాల్పడినట్లు విమర్శలు వచ్చాయి. ఎంపిక చేసిన లబ్ధిదారుల వివరాలను అధికారులకు అప్పగించగా, అదే సమయంలో ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఆ ప్రక్రియ ఆగిపోయింది. లబ్ధిదారులకు, డబ్బులు ఇచ్చిన వారికి వచ్చేది తమ ప్రభుత్వమేనని, అధికారంలోకి వచ్చిన వెంటనే మొదటి ప్రాధాన్యంగా పథకం కింద అందరికీ లబ్ధి జరుగుతుందని తెలిపారు. ఎన్నికల సమయంలో కూడా పథకం కింద అనర్హులను ఎంపిక చేశారని, డబ్బులు వసూలు చేసి అర్హులకు అన్యాయం చేశారని పలు గ్రామాల్లో ధర్నాలు కూడా జరిగాయి. అయితే ఎన్నికల ప్రక్రియ పూర్తయి, బీఆర్ఎస్ కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో లబ్ధిదారులు తాము చెల్లించిన డబ్బులు ఎలా తిరిగి వసూలు చేసుకోవాలోనని ఆందోళన చెందుతున్నారు.



వనపర్తి కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దళితబంధుకు ఎంపికైన వారు(ఫైల్)

నాయకుల ఇళ్ల వద్ద లొల్లి..

తామొకటి తలిస్తే.. దైవం ఒకటి తలిచిందన్న చందంగా మళ్లీ తమ ప్రభుత్వమే వచ్చి, తాము డబ్బులు వసూలు చేసి, ఎంపిక చేసిన లబ్ధిదారులకు పథకం కింద లబ్ధి చేకూరిస్తే ఇబ్బంది ఉండదని భావించిన బీఆర్ఎస్ నాయకులకు ఈ సారి ప్రజలు ఇచ్చిన తీర్పుతో పరిస్థితి తారుమారైంది. వారి ప్రభుత్వం రాకపోగా.. గత ప్రభుత్వంలో చేసిన పనులు, ఖర్చు చేసిన నిధులకు సంబంధించి సమీక్షలకు పూనుకోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. దళితబంధు పథకం కింద పట్టణాల్లో ఎంపిక చేసిన వారి స్థోమతను బట్టి.. రూ.30 వేల నుంచి రూ.రెండు లక్షల వరకు వసూలు చేయగా.. గ్రామాల్లో కనీసం రూ.లక్ష వరకు వసూలు చేసినట్లు విమర్శలు ఉన్నాయి. అలంపూర్, వనపర్తి నియోజకవర్గాల్లో ఈ దందా భారీగా జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. కొందరు లబ్ధిదారులు తాము డబ్బులు ఇచ్చిన నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లి లొల్లి చేస్తున్నారు. వనపర్తి జిల్లా రేవల్లి మండలంలో దళితబంధు కింద ఎంపికైన లబ్ధిదారుడు ఒకరికి గతంలో ట్రాక్టర్ ఉండేది. అయితే దళితబంధు కింద ఎంపిక చేయడంతో ట్రాక్టర్ అమ్మేసి బీఆర్ఎస్ నాయకుడికి డబ్బులు చెల్లించాడు. పథకం కింద డబ్బులు వచ్చిన తర్వాత మళ్లీ ట్రాక్టర్ కొనుగోలు చేసుకోవచ్చని అనుకున్నాడు. కానీ పరిస్థితి తారుమారు కావడంతో డబ్బులు తిరిగి ఇవ్వాలని అడిగితే సదరు నాయకుడు ఇవ్వలేనని చెబుతున్నారని సమాచారం. దీంతో ఎవరికి చెప్పుకోవాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. ఫిర్యాదు చేద్దామంటే గ్రామంలో తనకే ఇబ్బంది అవుతుందనే ఉద్దేశంతో ఆ లబ్ధిదారుడు స్తబ్దుగా ఉండిపోయాడు. వనపర్తి పట్టణంలోని ఓ కౌన్సిలర్ దళితబంధు కింద ఎంపిక చేస్తానని చెప్పి.. రూ.30 వేల చొప్పున వసూలు చేశాడు. వారిలో కొందరు ఇటీవల ఆ కౌన్సిలర్ వద్దకు వెళ్లి పంచాయితీ పెట్టుకున్నట్లు తెలిసింది. వారు ఇచ్చిన డబ్బులను పైస్థాయిలో సర్దుబాటు చేశానని.. ఇక తననేమి అడగవద్దని ఆ కౌన్సిలర్ చెప్పినట్లు సమాచారం.

కొత్త పథకంలో ఎంపిక చేయాలని ధర్నాలు


గోపాల్‌పేట మండలంలో అనర్హులను ఎంపిక చేశారని ఎన్నికల సమయంలో ధర్నా చేస్తున్న ప్రజలు(ఫైల్)

బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారం కోల్పోయి.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఎన్నికల హామీల్లో భాగంగా దళితబంధు స్థానంలో అంబేద్కర్ అభయ హస్తం కింద దళితులకు రూ.12 లక్షల చొప్పున మంజూరు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఇంకా ఈ పథకానికి సంబంధించి విధివిధానాలు ఖరారు కాలేదు. కానీ గత ఎన్నికల సమయంలో దళితబంధు కింద ఎంపికైన దళితులు పాత పథకం రద్దు కావడంతో కొత్తగా చేపట్టే అంబేద్కర్ అభయ హస్తం పథకంలో తమకు చోటు కల్పించాలని కోరుతున్నారు. బుధవారం వనపర్తి కలెక్టరేట్ వద్ద ధర్నా కూడా చేపట్టారు. అన్ని నియోజకవర్గాల్లో ఈ తరహా నిరసనలు జరిగే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో గతంలో ఎంపిక చేసిన వారికి కొత్త పథకం కింద లబ్ధి చేకూరుస్తారా? లేక పాత వారిని కాదని, కొత్తగా అర్హులను ఎంపిక చేస్తారా? అనే విషయంలో స్పష్టత లేదు. ఇప్పటికే గృహజ్యోతి పథకం కింద పనులను కొత్త ప్రభుత్వం రద్దు చేసింది. లబ్ధిదారులను కూడా కొత్తగా ఎంపిక చేయాలనే ఆలోచనలో భాగంగా ప్రజాపాలనలో దరఖాస్తులను స్వీకరించింది. అయితే దళితబంధు పథకానికి కూడా అదే విధానాన్ని అనుసరించే అవకాశం ఉంది. ఎందుకంటే గతంలో దళితబంధు పేరిట డబ్బులు తీసుకుని అనర్హులను ఎంపిక చేశారనే విమర్శలు ఉన్నాయి. ఎన్నికల సమయంలో కూడా అనర్హులను ఎంపిక చేశారని, బీఆర్ఎస్ నాయకుల అనుచరులకు మాత్రమే పథకం వర్తింపజేశారని దళితులు పలుచోట్ల నిరసనలు చేపట్టారు. దీంతో గతంలో ఎంపికైన లబ్ధిదారుల్లో ఆందోళన నెలకొంది. ఈసారి లబ్ధిదారులను ఎంపిక చేసే సమయంలో ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల ద్వారా కాకుండా.. అధికారుల ఆధ్వర్యంలో ఎంపిక చేయాలనే డిమాండ్ ఉంది. అప్పుడే అర్హులకు న్యాయం జరుగుతుందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.


ఉమామహేశ్వర క్షేత్రం

15 నుంచి ఉమామహేశ్వర బ్రహ్మోత్సవాలు

- రాష్ట్రం నలుమూలల నుంచి రానున్న భక్తులు
- ఏర్పాట్లు చేస్తున్న అధికారులు
- 48 ప్రత్యేక బస్సులు నడుపనున్న ఆర్టీసీ

అచ్చంపేట, జనవరి 12: నాగర్‌కర్నూల్ జిల్లా శ్రీశైల ఉత్తర ద్వారంగా పిలువబడుతున్న ఉమామహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 15 నుంచి 22 వరకు కొనసాగనున్నాయి. ఈ క్షేత్రం నల్లమల కొండల్లో 500 అడుగుల ఎత్తులో నిర్మితమైంది. ప్రకృతి రమణీయత మధ్య మామిడి చెట్టు కింద ఉమామహేశ్వరుడు కొలువుదీరాడు. ఏటా సంక్రాంతి మరుసటి రోజు క్షేత్రంలోని కొండ దిగువన ఉన్న భోగమహేశ్వరంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం కన్నుల పండువగా జరుగుతుంది. ఈ సందర్భంగా అచ్చంపేట నియోజకవర్గం నలుమూలల నుంచి అందంగా అలంకరించిన ప్రభలను క్షేత్రానికి తేవడం ఆనవాయితీ. రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటకల నుంచి కూడా భక్తులు తరలివస్తారు.

ఉత్సవాల వివరాలు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మొదటి రోజు అయ్యప్ప పూజ, జ్యోతి సమయంలో మంగళహారతి ఉంటుంది. రెండో రోజు మంగళవారం ప్రభోత్సవం, తర్వాత పల్లకీసేవ, సోమవారం తెల్లవారుజామున కొండ దిగువన భోగ మహేశ్వరంలో పార్వతీ పరమేశ్వరుల కల్యాణం ఉంటుంది. 17న బలిహరణం, నీరాజనము, సాయత్రం అశ్వవాహనసేవ, 18న ఉమామహేశ్వరీ దేవికి కుంకుమార్చన, రుద్రాభిషేకం, సాయంత్రం నంది వాహన సేవ, 19న విశేష పూజలతో పాటు సాయంత్రం శేషవాహన సేవ, త్రిశూల స్నానం ఉంటాయి. 20 నుంచి వివిధ కార్యక్రమాలతో పాటు పాపనాశనం వద్ద ఉత్తరాయణ పుణ్యకాల స్నానములు, ప్రత్యేక పూజలు ఉంటాయి.

ప్రత్యేక బస్సుల ఏర్పాటు

బ్రహ్మోత్సవాల కోసం ఉమామహేశ్వర క్షేతానికి ఆర్టీసీ ప్రత్యేకంగా 48 బస్సులను నడుపనుంది. అచ్చంపేట నుంచి రంగాపూర్ వరకు ఆరు బస్సులను, రంగాపూర్ నుంచి భోగమహేశ్వరం వరకు ఆరు బస్సులు, కొండపైకి ఎనిమిది బస్సులను నడుపనున్నట్లు డిపో మేనేజర్ పీవీ ప్రసాద్ తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం నుంచి మరో 10 బస్సులు నడుపనున్నట్లు వివరించారు. మహిళలకు ఉచిత ప్రయాణాన్ని దృష్టిలో ఉంచుకొని అదనంగా మరో 10 బస్సులను నడుపనున్నట్లు తెలిపారు. అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుండా సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించనున్నట్లు సీఐ అనుదీప్ తెలిపారు.

నేటి నుంచి నేషనల్ నెట్‌బాల్ టోర్నీ

- 28 రాష్ట్రాల నుంచి పాల్గొననున్న 720 మంది క్రీడాకారులు
- పాలమూరు స్టేడియం మైదానంలో ఏర్పాట్లు పూర్తి

మహబూబ్‌నగర్, జనవరి 12 : పాలమూరులో జాతీయస్థాయి క్రీడల సందడి నెలకొననుంది. నేటి నుంచి నాలుగు రోజుల పాటు జిల్లా కేంద్రంలో 2వ ఫస్ట్ 5 సీనియర్ నేషనల్ మహిళ, పురుషుల నెట్‌బాల్ చాంపియన్‌షిప్ టోర్నీ జరగనుంది. స్టేడియం మైదానంలోని ఇండోర్ స్టేడియంలో ఈ క్రీడలు జరగనున్నాయి. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి టోర్నీని ప్రారంభించనున్నారు. మొత్తం 28 రాష్ట్రాలకు చెందిన 720 మంది క్రీడాకారులు చాంపియన్‌షిప్‌లో పాల్గొనున్నారు. నాలుగేళ్ల తరువాత పాలమూరులో జాతీయస్థాయి టోర్నీ జరగనుండటంతో ఈ క్రీడలు పండగ వేళ సందడి చేయనున్నాయి. మహిళా క్రీడాకారులకు ఎన్టీఆర్ డిగ్రీ కళాశాల, తెలంగాణ ట్రైబల్ వెల్ఫేర్ అసోసియేషన్ హాస్టల్, పురుషుల కోసం చైతన్య స్కూల్, లిటిల్ స్కాలర్స్‌లో బస ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్ కౌన్సిలర్లపై వేసిన పిటిషన్ కొట్టివేత

మహబూబ్‌నగర్, జనవరి 12: పార్టీ ఫిరాయించిన కౌన్సిలర్లపై అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ నాయకులు కోర్టులో వేసిన పిటీషన్‌ను హై కోర్టు కొట్టివేసింది. బీఆర్ఎస్ పార్టీ నుంచి గెలుపొందిన ఆనంద్ కుమార్‌గౌడ్, బురుజు సుధాకర్‌రెడ్డి, రమాదేవి, లతాశ్రీలు కాంగ్రెస్ పార్టీలో చేరినందున వారిని డిస్‌క్వాలిఫై చేయాలని బీఆర్ఎస్ నాయకులు హై కోర్టులో పిటీషన్ వేశారు. శుక్రవారం ఇందుకు సంబంధించిన వాదనలు విన్న కోర్టు ఈ పిటీషన్‌ను కొట్టివేయడంతో కౌన్సిలర్‌లకు ఊరట లభించింది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు వీరంతా కాంగ్రెస్‌లో చేరడం, ఆ తరువాత ఆనంద్‌కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ చైర్మన్, వైస్ చైర్మన్‌లపై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే. కోర్టు కౌన్సిలర్‌లపై వేసిన పిటీషన్‌ను కొట్టివేసిందని లిఖితపూర్వక ఉత్తర్వులు రావలసి ఉందని పుర కమిషనర్ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

'దళిత బంధు'ను అమలు చేయాలి

హన్వాడ, జనవరి 12 : గత ప్రభుత్వంలో చేపట్టిన దళితబంధు పథకాన్ని కొనసాగించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ జంబులయ్య, జాతీయ సౌత్ ప్రెసిడెంట్ మాల్లెపోగు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. దళిత బంధు లబ్ధిదారులకు గత ప్రభుత్వం విడుదల నిధులను మంజూరి చేసి అమలు చేయాలని కోరారు. దళిత బంధు పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం హన్వాడ ఎంపీడీవో కార్యాలయం ముందు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం నియోజకవర్గానికి 1100 యూనిట్లు మంజూరి చేసిందని, లబ్ధిదారులను ఎంపిక చేసిందని, వారందరికి నిధులు మంజూరి చేసి పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రద్దు చేస్తామనడం సరికాదన్నారు. అనంతరం ఎంపీవోకు వినతి పత్రం అందజే శారు. దళిత సంఘాల నాయకులు రాములు, బాలకిష్టయ్య, హనుమంతు, కురుమయ్య, దస్తయ్య, తిరుపతయ్య ,వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

'దళిత అధికారులను వేధించటం సరికాదు'

పాలమూరు, జనవరి 12 : ప్రభుత్వ ఉద్యోగాలు చేసుకుంటున్న దళిత అధికారులను వేధించటం మానుకోవాలని ఎమ్మార్పీఎస్ దక్షిణ తెలంగాణ అధ్యక్షుడు మల్లెపోగు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ కమ్యూనిటీ హాలు ఆవరణలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలో అర్బన్ తహసీల్దార్‌గా పనిచేసిన పార్థసారథిని కొందరు పనిగట్టుకుని అసత్య ఆరోపణలు చేస్తూ, కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి మానసికంగా వేధించటం సరికాదన్నారు. కలెక్టర్, ఎస్పీలు దళితులపై అన్యాయంగా వేధిసున్న వారిపై పూర్తి స్థాయి విచారణ చేసిన దళితులకు న్యాయం చేయాలని కోరారు. సమావేశంలో జంబులయ్య, నరేష్, కృష్ణ, రమేష్, రాజు పాల్గొన్నారు.

ఇటుక బట్టీల వద్ద బాలకార్మికులు



అచ్యుతాపూర్ శివారులో ఇటుక బట్టి వద్ద పని చేస్తున్న బాలిక

వనపర్తి రూరల్, జనవరి 12: వనపర్తి మండలంలో ఇటుక బట్టీ పనిలో మైనర్లు ఉన్నారు. చదువుకోవాల్సిన పిల్లలు పనిలో నిమగ్నమై ఉండడంతో పలువురు అధికారులపై మండిపడుతున్నారు. ఉన్నతాధికారులు మైనర్లను పనిలో పెట్టుకోవద్దని, పనిలో పెట్టుకున్న యజమానులపై కేసు నమోదు చేస్తామని చెబుతున్నా ఇటుక బట్టీల వద్ద మైనర్లు పనిచేస్తూ కనిపిస్తున్నారు. వనపర్తి పట్టణ కేంద్రంతో పాటు అచ్యుతాపూర్, నర్సింగాయిపల్లి, తాడిపర్తిలో ఇటుక బట్టీ పనుల్లో అధికంగా మైనర్లే పని చేస్తున్నారు. వీరంతా ఇతర రాష్ట్రాలకు చెందిన వారు కావడం గమనార్హం. అధికారుల భయానికి ఏదో ఒక ప్రభుత్వ పాఠశాలలో అడ్మిషన్ పొంది ఆ పాఠశాల కూడా ఓ రోజు పోయినట్టు.. ఓ రోజు పోనట్టు ఉండి పిల్లల తల్లిదండ్రులు పిల్లలను బట్టిలో పని చేయిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి వెంటనే మైనర్లను పాఠశాలల్లో చేర్పించాలని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మైనర్లను పనిలో పెట్టుకుంటే చర్యలు

మైనర్లను పనిలో పెట్టుకుంటే యజమానులపై కేసు నమోదు చేస్తాం. ఇప్పటి వరకు మాకు ఎటువంటి సమాచారం లేదు. ఒక వేళ మైనర్ పిల్లలు పని చేసినట్లు మాకు ఏమైనా సమాచారం వస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

- తహసీల్దార్ యాదగిరి



పేకాట స్థావరంపై దాడి

» 2.43 లక్షల నగదు, ఏడు వాహనాలు, 10 మొబైల్స్ స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైకులను చూపుతున్న పోలీసులు

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 12 : పేకాట స్థావరంపై దాడి చేసి 2లక్షల 43వేల నగదు, ఆరు బైకులు, ఒక కారు స్వాధీరపర్చుకుని ఆరుగురిని అరెస్టు చేసినట్లు ఎస్‌ఐ మహేందర్ శుక్రవారం తెలిపారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ మండలంలోని వనపట్ల గ్రామ శివారులో ఆంజనేయులుగౌడ్ వ్యవసాయ పొలంలో పేకాట ఆడుతున్న సమాచారాన్ని తెలుసుకుని దాడి చేసి ఎనిమిది మందిని పట్టుకోగా ముగ్గురు పారిపోయినట్లు ఎస్‌ఐ తెలిపారు. వారి వద్ద 2లక్షల 43వేల నగదు, ఒక బలోనా కారు, ఆరు మోటారు సైకిళ్లను స్వాధీనపర్చుకున్నట్లు ఆయన తెలిపారు. వీరిలో అచ్చంపేటకు చెందిన ఇద్దరు, తెలకపల్లి మండలానికి చెందిన ముగ్గురు, కోడేరు మండలానికి చెందిన ఒకరు, పెద్దకొత్తపల్లి మండలానికి చెందిన ఒకరు, నాగర్‌కర్నూల్ మండలానికి చెందిన ఒకరిని పట్టుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

వాహనం ఢీకొని వానరం మృతి



మృతి చెందిన వానరాన్ని అంత్యక్రియలను తీసుకెళ్తున్న సిబ్బంది

కోస్గిరూరల్, జనవరి 12 : గుర్తు తెలియని వాహనం ఢీకొని ప్రమాదవశాత్తు వానరం మృతి చెందిన సంఘటన నారాయణపేట జిల్లా కోస్గి పట్టణ శివారులో చోటు చేసుకుంది. శుక్రవారం మధ్యాహ్నం కోస్గి శివారులోని సర్జాఖాన్‌పేట వెళ్లే మార్గంలో తొక్కుడుబండల ఎల్లమ్మ ఆలయ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొని కోతి మృతి చెందడంతో ఆటుగా వెళ్తున్న వారు గమనించి మునిసిపల్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. సిబ్బంది సహాయంతో చుట్టుపక్కల శివారు రైతులు వానరానికి అంత్యక్రియలు చేశారు.

దొంగతనాలను ఛేదించిన పోలీసులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

నాగర్‌కర్నూల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలో పలు దొంగతనాలకు పాల్పడిన దుండగులను పట్టుకుని భారీ మొత్తంలో విలువైన వస్తువులను స్వాధీనపర్చుకున్నట్లు నాగర్‌కర్నూల్ జిల్లా ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ పేర్కొన్నారు. ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఇట్టి విషయాలను వెల్లడించారు. కల్వకుర్తి పట్టణంలో వెంకటేశ్వర ఆలయంలో దొంగిలించిన పంచలోహ విగ్రహాలు, బంగారు ఆభరణాలు స్వాధీనపర్చుకున్నట్లు ఆయన తెలిపారు. వీరి వద్ద ఒక తులం ఆరుమాసాల బంగారంతోపాటు 5బైకులు, 21.9తులాల వెండి, 58కిలోల 84గ్రాముల ఇత్తడి వస్తువులు మొత్తం 4లక్షల 50వేల విలువ ఉంటుందని ఆయన తెలిపారు. నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

ప్రారంభమైన జాతర



తిరుమలనాథ స్వామి

హన్వాడ, జనవరి 12 : మండలంలోని గొండ్యాలలో వెలిసిన తిరుమలనాథ స్వామి జాతర శుక్రవారం ప్రారంభమైంది. ఈ నెల 12 నుంచి 17 వరకు జాతర ఉత్సవాలు జరుగనున్నాయి. మొదటి రోజు శుక్రవారం స్వామి వారి పల్లకి సేవ, పూజలు కొనసాగాయి. 13న ప్రభోత్సవం (తేరు) 14న బండ్లు తిరిగి జాతర ఉత్సవాలు జరుగనున్నాయి. 15 భజనలు, హారతి, 16 అమృత స్నానం, 17న జాతర ఉత్సవాలు ముగియనున్నాయి. వివిధ జిల్లాల నుంచి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు వెంకటాద్రి తెలిపారు.

హ్యాండ్‌బాల్ బాలికల జట్టు ఎంపిక



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన ఉమ్మడి జిల్లా బాలికల జూనియర్ జట్టు

జడ్చర్ల, జనవరి 12 : రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలలో పాల్గొనే జిల్లా బాలికల జట్టును శుక్రవారం జడ్చర్ల మండలం కోడ్గల్ జడ్పీహెచ్‌ఎస్‌లో మహబూబ్‌నగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా బాలికల జూనియర్ జట్టుకు రోజా, మౌనిక, వినీత, కృష్ణవేణి, సరిత, శ్రీవాణి, కల్పన, రజిత, హరిత, శివాణిచంద్ర, మీనాక్షి, భార్గవి, నందిని, దీక్షిత, జ్యోతి, సంధ్యలను, స్టాండ్‌బైగా భవానీ, అనూషలను ఎంపిక చేశారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 15 నుంచి 17వ తేదీ వరకు ఆదిలాబాద్ జిల్లా ఆసిఫాబాద్‌లోని ట్రైబల్ మాడల్ స్పోర్ట్స్ బాలికల పాఠశాలలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సభ్యులు శంకర్‌నాయక్ తెలిపారు. క్రీడాకారులను అసోసియేషన్ సభ్యులు శంకర్‌నాయక్‌తో పాటు అశోక్, మహేష్, అభిలాష్, శివకుమార్‌లు అభినందించారు.

ఇసుక అక్రమ ట్రాక్టర్ల పట్టివేత



పట్టుపడిన ఇసుక ట్రాక్టర్లు

కోస్గిరూరల్, జనవరి 12 : ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పక్కా సమాచారంతో పోలీసులు పట్టుకున్నారు. శుక్రవారం నారాయణపేట జిల్లా కోస్గి మండలంలోని బిజ్జారం వాగు నుంచి పోతిరెడ్డిపల్లికి ఇసుకను అనుమతి లేకుండా తరలిస్తుండటంతో పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలి

» జాతీయ రహదారిపై పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద రాస్తారోకో




అలంపూర్ టోల్ ప్లాజా వద్ద రాస్తారోకో చేస్తున్న బాధితులు

అలంపూర్ చౌరస్తా, జనవరి 12: బాధితకుటుంబాలకు న్యాయం చేయాలని పలువురు డిమాండ్ చేశారు. పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలో జాతీయరహదారిపై గురువారం హైవేలో పని చేస్తున్న కూలీలపై పాలవ్యాన్ దూసుకెళ్లిన ఘటనలో ఇద్దరు కూలీలు మరణించిన విషయం విదితమే. శుక్రవారం బాధిత కుటుంబాలు, వారి బంధువులు, సదరు గ్రామాల ప్రజలు జాతీయ రహదారిపై మెరుపు ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బాధిత కుటుంబాలకు తక్షణమే ఒక్కొరికి రూ.2.20లక్షలు ఇస్తామని చెప్పి పోస్టుమార్టం అనంతరం రూ. లక్ష మాత్రమే ఇచ్చి జారుకునే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. బాధిత కుటుంబాలు, సదరు గ్రామాల ప్రజలు కర్నూలు ఆసుపత్రి మార్చురీ నుంచి నేరుగా పుల్లూరు టోల్ ప్లాజా వద్దకు వచ్చి మృతదేహాలను రోడ్డుపై ఉంచి ధర్నా చేశారు. టాల్‌ప్లాజా వద్ద దాదాపు గంటపాటు ట్రాఫిక్ జామ్ అయింది. దాంతో సమాచారం అందుకున్న సీఐ రాజు, ఉండవల్లి ఎస్సై బాలరాజు వచ్చి కాంట్రాక్టర్‌తో మాట్లాడి బాధితులకు సర్దిచెప్పి ధర్నా విరమించారు.

నేటి నుంచి నరసన్నగుట్టపై బ్రహ్మోత్సవాలు

- భక్తుల కోరికలు తీర్చే నరసింహస్వామి
- దాతల సహకారంతో అభివృద్ధి పనులు



లక్ష్మీనరసింహస్వామి దేవాలయం



గుహలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి

తిమ్మాజిపేట, జనవరి 11 : తిమ్మాజిపేట మండల ప రిధిలోని అప్పాజీపల్లి శివారులో నరసన్నగుట్టపై స్వయం భువుగా వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 13 నుంచి ప్రారంభం కానున్నాయి. భక్తుల కోరికలు తీర్చే శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఆవరణ పరిసరాల్లోను దాతల సహకారంతో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గుట్టపై గుహలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకోవడానికి ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి వేలాదిగా భక్తులు రావడం విశేషం. ప్రస్తుతం భక్తులు కాలినడకన వచ్చేందుకు వీలుగా మెట్ల దారిని నిర్మించా రు. వాహనాలు గుట్టపైకి వ చ్చేందుకు కిందికి దిగడానికి మరో రోడ్డు మార్గాన్ని ఏర్పా టు చేశారు. గతంలో గుట్టపై విద్యుత్ స్తంభం కోసం తవ్వి న గుంతలో నీరు రావడంతో ఆ కోనేరులో నీటిని తీర్థంలో తీసుకోవడంతో సకల రోగా లు, పాపాలు దూరమవుతా యని కోరికలు నెరవేరుతా యని భక్తుల నమ్మకం. గుమ్మకొండ దగ్గర నందివడ్డెమాన్ గ్రామానికి చెందిన తిప్పిరెడ్డి సుధాకర్‌రెడ్డి మన్నెమ్మ దంపతులు ఆలయ ముఖ ద్వారాన్ని ఏర్పాటు చేయగా కొడుపర్తి గ్రామ నివాసి చిలుక కృష్ణారెడ్డి జ్ఞాపకార్థమై కుమారులు చిలుక సురేందర్‌రెడ్డి, చిలుక రాజేందర్‌రెడ్డిలు దాదాపు 81లక్షల వ్యయంతో ఆలయ మంటపాన్ని విశాలంగా మార్చడమే కాకుండా వాహనాలు కిందికి దిగడానికి మరో మార్గాన్ని కల్పించడం వాహనాలు నిలిపేందుకు వీలుగా పార్కింగ్ సదుపాయాన్ని కల్పించారు. దేవాదాయ శాఖ ద్వారా మంజూరైన రూ. 68 లక్షలతో ఆలయాన్ని ఆధునీకరించి అంజనేయస్వామి ఆండాలమ్మ, మహాలక్ష్మి అమ్మవార్ల ఆ లయాలను నిర్మించారు. హైదరాబాద్‌కు చెందిన రాజ శేఖర్‌రెడ్డి దంపతులు ఐదు లక్షలతో వంటశాలను నిర్మిం చగా ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి తన నిధులతో భక్తుల కోసం మరుగుదొడ్లు నిర్మించారు. గుమ్మకొండ సర్పంచ్ సత్యంయాదవ్ స్వామి వారికి అవసరమయ్యే పూలను పెంచడం కోసం తండ్రి చిన్నయ్య పేరిట పూలతోటను ఏ ర్పాటు చేశారు. అందరి సహకారంతో దినదినాభివృద్ధి చెం దుతూ నిత్య పూజలు అందుకుంటున్న శ్రీలక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకోవడం విశేషం. ప్రభుత్వం ద్వారా కోటి రూపాయలు మంజూరు చేయించి గుట్టపైన కల్యాణ మంటపాన్ని నిర్మింపజేయాలన్నది తమ లక్ష్యమని, ఆల య అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామని ఆలయ ధర్మక ర్తలు చిలుక సురేందర్‌రెడ్డి, చిలుక రాజేందర్‌రెడ్డిలు తెలి పారు. 13న అంకురార్పణ, సుదర్శన హోమం, పల్లకి సేవ, భజనలు, 14న శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణ మహోత్సవం, సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు, అన్న దానం, రాత్రికి రథోత్సవం ఉంటుందన్నారు. అదేవిధంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని, 15న బండ్ల ప్రదర్శన, స్వామి వారికి ఉద్దాలు తీసుకెళ్లడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఆటో బోల్తా..

» ముగ్గురికి స్వల్పగాయాలు



సంఘటన స్థలం వద్ద జనం

వడ్డేపల్లి, జనవరి 12: మునిసిపాలిటీ పరిధిలోని శాంతినగర్ శివారులో శుక్రవారం ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఆటోలో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రాణనష్టం జరగకపోవడంతో ఊపిరిపీల్చుకున్నారు. స్థానికులు గమనించి తక్షణమే స్పందించడం వల్ల ప్రాణనష్టం జరగలేదన్నారు.

పార్టీ మారే ఆలోచన లేదు



తిరుమలలో కుటుంబ సభ్యులతో ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి

తిరుమల, జనవరి12(ఆంధ్రజ్యోతి): 'కేసీఆర్ నన్ను గుర్తించి గతంలో ఎంపీ సీటు ఇచ్చారు. పార్టీ మారే ఆలోచన నాకు లేదు' అని బీఆర్ఎస్ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రకాలుగా అభివృద్ధి చెందిందన్నారు. ప్రజలు కూడా ఆర్థికంగా బలపడ్డారన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎంపీలు అందరూ గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారుమళ్లీ బీఆర్ఎస్ నుంచి ఎంపీ టికెట్ తనకే వస్తుందన్నారు.

చెంచు కుటుంబంలో విషాదం

- సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు

లింగాల, జనవరి 12: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండల పరిధిలోని నల్లమల లోతట్టు ప్రాంతంలోని రాంపూర్‌పెంటలో సంక్రాంతి పర్వదినం వేళ తల్లి ఇద్దరు పిల్లల ఆత్మహత్యలు పెంటలో విషాదాన్ని నింపాయి. గురువారం రాత్రి తల్లి ఇద్దరు పిల్లలు ఆత్మహత్య చేసుకోవడంలో క్షణికావేశమేనని తెలుస్తున్నది. స్థానికుల వివరాల మేరకు.. పండుగ సమయంలో పిల్లలకు, తనకు కొత్త దుస్తులు తీసుకరావాలని మృతురాలు నాగమ్మ భర్త చిన్నబయ్యన్నను కోరింది. పెద్దవాగు బేస్ క్యాంపులో వాచర్‌గా పని చేస్తున్న చిన్నబయ్యన్న గత కొన్ని నెలల నుంచి జీతాలు లేవని భార్యతో చెప్పి మన్ననూరుకు వెళ్లాడు. అప్పు చేసి అయినా భార్యాపిల్లలకు కొత్త దుస్తులు తీసుకరావాలనే ఆలోచనతో మన్ననూర్‌కు వచ్చిన అతడు కొద్ది సేపటికే భార్యాపిల్లలు ఆత్మహత్య చేసుకున్నారని తెలుసుకొని విషాదంతో పెంటకు తిరిగి వెళ్లాడు. ఈ సంఘటనకు సంబంధించి పూర్తి వివరాలు సేకరించేందుకు అచ్చంపేట సీఐ అనుదీప్, లింగాల ఎస్సై శ్రీనివాసులు శుక్రవారం రాంపూర్‌పెంటకు వచ్చారు. డాక్టర్‌ను వెంట తీసుకెళ్లిన పోలీసులు పెంటలోనే పోస్టుమార్టం నిర్వహించారు. మృతురాలి తల్లి ఉడ్తనూరి లక్ష్మమ్మ ఫిర్యాదు మేరకు సీఐ పర్యవేక్షణలో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తికి తీవ్ర గాయాలు

నాగర్‌కర్నూల్ క్రైం, జనవరి 12 : నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలో నాగనూల్ గ్రామానికి చెందిన చంద్రయ్య(60) బైకుపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. బైకుపై తమ గ్రామ సమీపంలో వెళ్తుండగా కింద పడడంతో జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం మహబూబ్‌నగర్‌కు తరలించాలని వైద్యులు సూచించారు.

జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థి

ధన్వాడ, జనవరి 12 : నారాయణపేట జిల్లా ధన్వాడ కస్తూర్బా గురుకుల పాఠశాల విద్యార్థి నాగలక్ష్మి జాతీయ స్థాయి రెజ్లింగ్ పోటీలకు ఎంపికైయ్యారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థిని రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చి జాతీయ స్థాయి ఎంపిక కావడంపై పలువురు విద్యార్థినులు అభినందించారు. ఈనెల 19 నుంచి 30 వరకు జరగనున్న ఖేల్ ఇండియాల్లో నాగలక్ష్మి పాల్గొననున్నట్లు ప్రిన్సిపాల్ గంగమ్మ తెలిపారు.

కుళ్లిన స్థితిలో వ్యక్తి మృతదేహం లభ్యం

జడ్చర్ల, జనవరి 12 : జడ్చర్ల పట్టణం నుంచి ఆలూరుకు వెళ్లే దారిలోని సత్తూరు కృష్ణయ్యగౌడ్‌కు చెందిన కోళ్లఫాం సమీపంలోని బీడుభూమిలో కుళ్లిన స్థితిలో ఉన్న వ్యక్తి మృతదేహం లభ్యమైందని జడ్చర్ల ఎస్‌ఐ నాగరాజు తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం మల్కాపూర్ గ్రామానికి చెందిన మాధవాచారి(40)గా గుర్తించినట్లు తెలిపారు. మృతదేహం కుళ్లిపోయి ఉందని తెలిపారు. కాగా తుమ్మల్‌సూర్ గ్రామానికి చెందిన మేస్త్రీ ఫోన్‌తో ఈ నెల 6న ఫోన్ చేసి కూలీ పనికి వెళ్తున్నట్లుగా చెప్పాడని, అనంతరం మాధవాచారి ఆచూకీ తెలియలేదని మాధవాచారి కుమార్తె నేతినూరు సుప్రియ ఫిర్యాదు చేసిందని తెలిపారు. తండ్రి మృతిపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొందని, దాంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని జడ్చర్ల ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వృత్తి ధర్మాన్ని నెరవేర్చిన అచ్చంపేట ఎమ్మెల్యే

» ఇబ్బందికర స్థితిలో ఉన్న గర్భిణికి శస్త్ర చికిత్స ద్వారా ప్రసవం చేసిన వంశీకృష్ణ



ప్రసవం అనంతరం బిడ్డను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న డాక్టర్ వంశీకృష్ణ

అచ్చంపేట, జనవరి 12 : వైద్యుడిగా వృత్తి ధర్మాన్ని నేరవేర్చారు నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ. ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం ఓ గర్భిణి ప్రసవ వేదనతో ఇబ్బంది పడుతున్న విషయం విషయం తెలుసుకున్నారు. ఆసుపత్రికి చేరుకున్న ఆయన గర్భిణికి శస్త్ర చికిత్స చేయగా, ఆమె పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. వివరాలిలా ఉన్నాయి. లింగాల మండల పరిధిలోని జిలుగుపల్లి గ్రామానికి చెందిన బోయ భాస్కర్ భార్య ప్రసన్న పురిటి నొప్పులతో అచ్చంపేట సివిల్ ఆసుపత్రికి వచ్చింది. సాధారణ ప్రసవం కోసం అక్కడున్న నర్సులు ప్రయత్నించగా సాధ్యం కాలేదు. ప్రసవ వేదనతో ఇబ్బంది పడుతున్న గర్భిణి బాధను తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ తక్షణమే ఆసుపత్రికి చేరుకున్నారు. ఆమెను ఆపరేషన్ థియేటర్‌కు తీసుకెళ్లి, శస్త్ర చికిత్సను విజయవంతంగా పూర్తి చేయడంతో ఆమె పండంటి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డలు క్షేమంగా, ఆరోగ్యంగా ఉన్నట్లు ఎమ్మెల్యే చెప్పడంతో కుటుంబ సభ్యులు సంతోషించారు. కాగా, భార్యా భర్తలు ఇద్దరూ దివ్యాంగులు.

పీయూ ప్రిన్సిపాల్‌కు టీఏఆర్ఈ ఫెలోషిప్

» డాక్టర్ చంద్రకిరణ్‌ను అభినందించిన పీయూ వీసీ, రిజిస్ట్రార్, విద్యావేత్తలు, సైంటిస్టులు



పీయూ ప్రిన్సిపాల్ డాక్టర్ న్.చంద్రకిరణ్‌ను అభినందిస్తున్న వైస్ చాన్స్‌లర్

పాలమూరు యూనివర్సిటీ, జనవరి 12 : పాలమూరు యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రకిరణ్ టీఏఆర్ఈ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. భారత ప్రభుత్వ శాస్త్ర, సాంకేతిక రంగానికి చెందిన సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రిసెర్చ్ బోర్డ్ (డీఎస్‌టీఈ-ఎస్ఈఆర్‌బీ) వారు ప్రతీయేటా ఇచ్చే టీఏఆర్ఈ (టీచర్స్ అసోషియోట్‌షిప్ ఫర్ రీసెర్చ్ ఎక్సవన్స్) ఫెలోషిప్‌ఎకు కెమిస్ట్రీ విభాగాధిపతి, యూనివర్సిటీ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.చంద్రకిరణ్ ఎంపికయ్యారు. ఫెలోషిప్‌కు ఎంపికైనట్లు అందుకు సంబంధించిన సమాచారం ఆన్‌లైన్‌లో గురువారం అధికారిక ప్రకటన వెలువరించినట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా ఆ ఫెలోషిప్‌తో పాటు రీసెర్చ్ ప్రాజెక్ట్ గ్రాంట్స్‌లో ప్రతీయేట రూ.15 లక్షల చొప్పున మూడేళ్ల పాటు ఇస్తారని ఆయన తెలిపారు. హైదరాబాద్‌లోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (ఐఐసీటీ) వారి సహకారంతో సీనియర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ అయిన డాక్టర్ మద్ది శ్రీధర్‌రెడ్డితో కలిసి ఈ ప్రాజెక్ట్ చేయడానికి అవకాశం కల్పించారని ఆయన తెలిపారు. దీని వలన డాక్టర్ ఐఐసీటీలో గల ఇంటర్‌నేషనల్ ఫెసిలిస్ టాప్ అన్నింటిని మూడేళ్లపాటు ఉచితంగా ఉపయోగించడానికి తనకు మంజూరు లభించిందని ఎన్.చంద్రకిరణ్ తెలిపారు. ప్రిపరేషన్ క్యారెక్టరైజేషన్ అండ్ సింథటిక్ అప్లికేషన్స్ ఆఫ్ లివీస్ బేస్ అడక్ట్స్ ఆఫ్ డీఏబీసీవో యాస్ డైరెక్ట్ గ్రీన్ రిఫజెంట్స్ విత్ గుడ్ ఈ ఫాక్టర్ అనే అంశానికి ఈ ఫెలోషిప్, ప్రాజెక్ట్ లభించిందని వివరించారు. ప్రాజెక్ట్ ముఖ్య ఉద్దేశం పర్యావరణ హితంగా పరిశోధన చేసి నూతన కారకాలను కనుకొని వాటిని సమాజహితానికి ఉపయోగించడానికి కూడా ఐఐసీటీలో తన పరిశోధన తీసుకోవడానికి వీలు కల్పించారని ప్రిన్సిపాల్ చంద్రకిరణ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో మొత్తం ఆరు కొత్త యూనివర్సిటీలలో మొట్టమొదటిసారిగా టీఏఆర్ఈ (టీచర్స్ అసోసియోషన్ ఫర్ రీసెర్చ్ ఎక్సవన్స్) ఫెలోషిప్, ఫెలో ప్రాజెక్ట్ అని చంద్రకిరణ్ తెలిపారు. పాలమూరు యూనివర్సిటీకి చెందిన అధ్యాపకుడికి రావడం చాలా సంతోషంగా ఉందని పీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ ఎల్‌బీ. లక్ష్మీకాంత్ రాథోడ్, పీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ గిరిజా మంగతాయారు అన్నారు. ఈ సందర్భంగా చంద్రకిరణ్‌ను వారు అభినందించారు. విభాగాధిపతులు, అధికారులు, శుభాకాంక్షలు తెలిపారు.

బైకును ఢీ కొట్టిన గుర్తు తెలియని వాహనం

» ఒకరు మృతి, మరొకరికి తీవ్రగాయాలు

జడ్చర్ల, జనవరి 12 : జాతీయరహదారి జడ్చర్ల మండలం మాచారం గ్రామ సమీపంలో బైకును గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో ఒకరు మృతిచెందారు. మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. జడ్చర్ల ఎస్‌ఐ చంద్రమోహన్ తెలిపిన వివరాల మేరకు... బిహార్ రాష్ట్రం భోజ్‌పూర్ జిల్లా ధన్‌చుహాన్ గ్రామానికి చెందిన డబ్లుకుమార్, బిట్టుకుమార్‌లు జడ్చర్ల మండలం గొల్లపల్లి సమీపంలోని హైడ్రోకెమికల్ కంపెనీలో పని చేస్తారు. జడ్చర్ల మండలం మాచారం నుంచి గొల్లపల్లి సమీపంలోని థర్మల్ కేబుల్ కంపెనీలో పనిచేసే స్నేహితుడు టున్‌టున్‌కుమార్‌కు భోజనం ఇవ్వడానికి మాచారం నుంచి బైకుపై బయలుదేరారు. గొల్లపల్లి సమీపంలో వీరి బైకును గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిని వీరిద్దరిని చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో జిల్లా జనరల్ ఆసుపత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ బిట్టుకుమార్(20) శుక్రవారం రాత్రి 10.30 నిమిషాలకు మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన డబ్లుకుమార్ ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. డబ్లుకుమార్ సోదరుడు దంచుహానునీల్‌సింగ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పురుషుల నెట్‌బాల్ చాంపియన్ తెలంగాణ

» మహిళల విజేత కర్ణాటక

మహబూబ్‌నగర్, జనవరి 12 : జిల్లా నెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సౌత్‌జోన్ ఫాస్ట్ 5 మహిళా, పురుషుల నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ టోర్నీలో పురుషుల విభాగంలో తెలంగాణ చాంపియన్‌గా నిలువగా మహిళల విభాగంలో కర్ణాటక చాంపియన్‌గా నిలిచింది. అదేవిధంగా మెన్స్ ఫాస్ట్ 5 విజేతగా కర్ణాటక నిలువగా, ఉమెన్స్ ఫాస్ట్ 5 విజేతగా కేరళ నిలిచింది. పురుషుల ఫైనల్ మ్యాచ్‌లో తెలంగాణ జట్టు 12-04 స్కోర్‌తో కర్ణాటకపై గెలిచి చాంపియన్‌గా నిలువగా, మహిళల విభాగంలో కర్ణాటక జట్టు 20-18తో కేరళపై గెలిచి చాంపియన్‌గా నిలిచింది. వీటితోపాటు ఫాస్ట్ 5 విభాగంలో పురుషుల విభాగంలో కర్ణాటక జట్టు 20-0 స్కోర్‌తో కేరళపై మహిళ విభాగంలో కేరళ జట్టు 26-22 స్కోర్‌తో కర్ణాటకపై విజయం సాధించాయి. విజేతలకు సౌత్‌జోన్ నెట్‌బాల్ చైర్మన్ గిరీష్ సి గౌడ బహుమతులను అందజేశారు.

కఠోర దీక్షలతో మానసిక ప్రశాంతత



ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి

ఊర్కొండ, జనవరి 12: కఠోర దీక్షలు, ఉపవాసాలతో మానసిక ప్రశాంతత లభించడంతో పాటు ఆరోగ్యవంతమైన జీవన విధానానికి తోడ్పాటు లభిస్తుందని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామంలో ఇరుముడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి సమాజంలో ఆధ్యాత్మిక చింతన చాలా అవసరమని, దైవం పట్ల భక్తి భావం పెరిగి చెడు నుంచి దూరంగా వెళతామని అన్నారు. సర్పంచులు శివరాణి, అనిత, గురుస్వామి యెన్నం సత్యనారాయణ గుప్తా స్వాములు అనిల్, హరీష్, ఆంజనేయులు, డీసీసీ ప్రధాన కార్యదర్శి రమేష్ నాయక్, డీసీసీ అధికారి ప్రతినిధి వీరస్వామి, నాయకులు అయూబ్ పాషా, కృష్ణయ్య, దుబ్బ మల్లేష్ ఉన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



డీసీసీ ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్య యాదవ్‌కు సన్మానిస్తున్న మండల కాంగ్రెస్ నాయకులు

చారకొండ, జనవరి 12: అన్ని వర్గాల అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని డీసీసీ ఉపాధ్యక్షుడు జూపల్లి వెంకటయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం ఆయన మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేసి ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందజేస్తామని అన్నారు. ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి ఉమ్మడి వంగూరు మండలంలోని కొండారెడ్డిపల్లి గ్రామం అయినందున మన ప్రాంతం అభివృద్ధి పథంలో ముందుకు దూసుకెళ్తుందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ 9ఏళ్ల పాలనలో ఈ ప్రాంతం ఎక్కడ అభివృద్ధికి నోచుకోలేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే సీఎం రేవంత్‌రెడ్డి రెండు పథకాలను అమలు చేశారని గుర్తు చేశారు. మిగతా పథకాలు కూడా వెంటనే అమలు చేయడానికి కృషి చేస్తామని అన్నారు. అంతకుముందు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు జమ్మికింది బాల్‌రాంగౌడ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి మహేందర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇటీవల డీసీసీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన జూపల్లి వెంకటయ్యయాదవ్‌కు శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. నాయకులు బొడ్డు దశరథం, సహదేవ్, లక్ష్మణ్‌గౌడ్, మల్లికార్జున్, సత్తార్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి అయోధ్య రామయ్య అక్షింతలు



అక్షింతలతో సీతారామచంద్రస్వామి ఆలయ అర్చకులు, భక్తులు

చారకొండ, జనవరి 12: అయోధ్య రామయ్య ఆలయం నుంచి తీసుకొచ్చిన అక్షింతలను మండలంలో రెండవ అపర భద్రాద్రిగా పేరుగాంచిన శిర్సనగండ్ల సీతారామచంద్రస్వామి దేవాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు చేసి శ్రీరాముడి అక్షింతలను శుక్రవారం ఆలయ పూజారి డేరం లక్ష్మణశర్మ, భక్తులు మండలంలోని శిర్సనగండ్లలో ఇంటింటికి వెళ్లి అందజేశారు. ఈనెల 22న అయోధ్యలో నూతనంగా నిర్మించిన రామాలయంలో ప్రాణప్రతిష్ఠా మహోత్సవం రోజున అక్షింతలకు ఇంట్లోని పూజ మందిరంలో ప్రత్యేక పూజలు చేసి తలపై వేసుకోవాలని ఆలయ పూజారి సూచించారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు రవినాయక్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి కృష్ణ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

● బిజినేపల్లి: అయోధ్య రామాలయంలో ప్రత్యేక పూజలు అందుకొని గ్రామాలకు చేరిన పవిత్ర రాములోరి అంక్షితలను రామభక్తులు ఇంటింటికి తిరిగి అందజేశారు. మండలంలోని మంగనూర్‌లో రామభక్తులు భజనలు, కీర్తనలతో ఇంటింటికి తిరిగి అయోధ్య రామయ్య అక్షింతలను అందజేసి ఈనెల 22న అయోధ్యలో విగ్రహాల ప్రాణప్రతిష్ఠ ప్రత్యేక పూజలు అనంతరం ఇంట్లో ప్రత్యేక పూజలు చేసి ఇంటిల్లిపాది తలపై అక్షింతలు వేసుకోవాలని సూచించారు. గుబ్బ తిరుతపతయ్య, రామకృష్ణరావు, బి.శ్రీనివాస్ రెడ్డి, గుబ్బ చరణ్, కాడం యాదయ్య, గుజ్జుల అంజనేయులు, వేముల విష్ణు, కదిరె అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.

● ఊర్కొండ: శ్రీరామ అయోధ్య మందిరం అక్షింతలు మండలంలోని ఊర్కొండపేటలో గడప గడపకు వితరణ చేశారు. శుక్రవారం ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి ఆలయం నుంచి గ్రామం వీధులు గుండా శోభాయాత్రగా గడప గడపకు అక్షింతలు వితరణ పంపిణీ చేశారు. ప్రధాన అర్చకులు దత్తాత్రేయ శర్మ, నాయకులు దండోత్కర్ నాగోజి, శ్రీనివాస్, మల్లికార్జున్ గౌడ్ చంద్రయ్య, అంజయ్యగౌడ్, శాయిరెడ్డి, హన్మంతు, ప్రవీణ్ రెడ్డి, అంజన్ రెడ్డి, అరవింద్ గౌడ్, హరీశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వత్థామరెడ్డిని సన్మానించిన ఆర్టీసీ ఉద్యోగులు



అశ్వత్థామరెడ్డిని సన్మానిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు

కల్వకుర్తి, జనవరి 12: కల్వకుర్తి పట్టణంలోని ఆర్టీసీ డిపోను టీఎంయూ వ్యవస్థాపక అధ్యక్షుడు అశ్వత్థామరెడ్డి శుక్రవారం సందర్శించారు. ఆర్టీసీ డిపోకు వచ్చిన అశ్వద్దామరెడ్డిని డిపో సెక్రటరీ రవీందర్, డిపో ప్రెసిడెంట్ ఎల్‌పీ రెడ్డి, ఎల్‌హెచ్‌పీ జాతీయ నాయకుడు చిన్నికృష్ణ ఆధ్వర్యంలో ఉద్యోగులు పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా అశ్వత్థామరెడ్డి మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల హక్కుల సాధన కోసం కలిసి పోరాడుదామని పేర్కొన్నారు. డిపో వర్కింగ్ ప్రెసిడెంట్ ఆరీఫ్, సీసీఎస్ డెలిగేట్ శ్రీనివాసులు, గ్యారేజ్ సెక్రటరీ ఎంకే చారి, మెకానిక్ విజయ్, మధుసూదన్, నరేందర్, ఎంఎన్.గౌడ్, బస్తీరంపాల్గొన్నారు.

నిరుపేద యువతి పెళ్లికి అండగా నిలిచిన మైనార్టీ పెద్దలు

కందనూలు, జనవరి 12 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి చెందిన నిరుపేద ముస్లిం యువతి వివాహానికి ముందుండి ముస్లిం పెద్దలు, మైనార్టీ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం జరిపించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని 15వ వార్డుకు చెందిన నిరుపేద అయిన ఖలీల్ కూతురు ఖమరున్నీసా బేగం వివాహం పట్టణానికి చెందిన ఖాజా అనే యువకుడితో నిశ్చయం కాగా నిరుపేద అయిన ఖలీల్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు, ముస్లిం మత పెద్దలైన హబీబ్‌ఖాన్, హబీబ్ ఉర్‌రహ్మాన్, మహమ్మద్‌గౌస్‌లను సంప్రదించారు. దంపతులను ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి ఆశీర్వదించి పెళ్లికి ఆదర్శంగా నిలిచి సహాయం అందించిన ప్రతీ ఒక్కరిని అభినందించారు. దళిత సంఘాల నాయకులు వంకేశ్వరం నిరంజన్, శ్రీనివాస్‌బహదూర్, వల్లభరెడ్డి, కాంగ్రెస్ ముస్లిం మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు హబీబ్, హబీబ్‌ఖాన్, గౌస్, నాగనూలు నిరంజన్, మునిసిపల్ కో ఆప్షన్ సభ్యుడు ముస్తాఖ్, అహ్మద్, ముస్లిం మైనార్టీ పెద్దలు మహమ్మద్ సాదిక్‌పాషా, యాకుబ్, బావాజీర్, ఖాజీ, ఇమామ్, అబ్దుల్‌హక్, ఖుద్బోద్దీన్‌ఖాన్, హఫీజ్, హుస్సేన్, కాంగ్రెస్ నాయకులు బాబా, ఖలీల్, ఇఫ్తేఖర్, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపూర్‌లో రక్తదాన శిబిరం

వెల్దండ, జనవరి 12 : మండల పరిధిలోని పెద్దాపూర్ గ్రామంలో స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని రక్తదాన శిబిరం నిర్వహించారు. యువకులు పెద్దఎత్తున శిబిరంలో పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు చక్రవర్తిగౌడ్, నాయకులు యాదయ్య, కొండల్, హరిప్రసాద్, కృష్ణమాచారి, శేఖర్ తదితరులు ఉన్నారు. అలాగే, వెల్దండలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో జాతీయ యువజనోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ సంజీవరెడ్డి, ఎన్ఎస్ఎస్ పీవో శివప్రసాద్, అధ్యాపకులు విజయలక్ష్మి, రమేష్, సుమలత, తిర్పతయ్య, అంజమ్మ, శివకుమార్ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలపై గళం వినిపిస్తాం

- సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

- సీపీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు ఘన సన్మానం



ఎమ్మెల్యేలు కూనంనేని సాంబశివరావు, కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డిలను సన్మానిస్తున్న సీపీఐ నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 12: కాంగ్రెస్‌తో స్నేహ బంధాన్ని కాపాడుకుంటూనే అసెంబ్లీలో ప్రజా సమస్యలపై గళం వినిపిస్తామని కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సాయిగార్డెన్‌లో సీపీఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.బాల్‌నర్సింహ అధ్యక్షతన కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో పాటు ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డిలను ఘనంగా సన్మానించి అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టులపై నిషేధం ఉన్న కాలం నాటి నుంచి కాంగ్రెస్‌తో కలిసి పని చేస్తున్నామన్నారు. దేశంలో ప్రజా సమస్యలపై చేసిన ప్రతి చట్టం వెనుక కమ్యూనిస్టుల పాత్ర ఉందన్నారు. అధికారం కోసం ఏనాడు ఆరాటపడని కమ్యూనిస్టులు ఎల్లప్పుడూ నిజాయతీ, చిత్తశుద్ధితో ప్రజల పక్షాన నిలబడతారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేసీఆర్ పాత్ర ఉంది కాదనలేమని, కానీ సాయుధ పోరాటాల నాటి నుంచి తెలంగాణ ఉద్యమంలో అనేక సందర్భంగా కమ్యూనిస్టులు కూడా కీలక పాత్ర పోషించారన్నారు. కమ్యూనిస్టులతో సంబంధం విఫలం చెందినప్పుడే బీఆర్ఎస్ పతనం చెందిందన్నారు. కమ్యూనిస్టులు కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్నది సీట్ల కోసం కాదని, రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను ఓడించి ఆ పార్టీ చీకటి స్నేహ బంధం కొనసాగిస్తున్న కేంద్రంలోని బీజేపీని బలహీన పరచాలనే లక్ష్యం కోసమని స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణం గా పనిచేస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడా నికి సీపీఐ తన వంతు పాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు. ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ నియోజవర్గంలో సీపీఐ బలంగా ఉన్న గ్రామాలను గత పాలకులు నిర్లక్ష్యం చేస్తూ వచ్చా రన్నారు. నియోజకవర్గంలోని సీపీఐ నాయకులతో తనకు చాలా కాలం నుంచి మంచి సంబంధాలు ఉన్నాయని, అదే బంధాన్ని కొనసాగిస్తూ నియోజవర్గం అభివృద్ధికి కలిసి పని చేస్తామని ఆయన అన్నారు. ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం అసెంబ్లీకి నాతో పాటు కొత్తగా వచ్చిన ఎమ్మెల్యేలకు కూనంనేని ప్రసంగాలు స్ఫూర్తి నిశ్చయన్నారు. నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు ఎలాంటి అన్యాయం జరుగకుండా చూసుకుంటానని హామీ ఇచ్చారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బాల్‌నర్సింహ మాట్లాడుతూ అభివృద్ధి అంటే పెళ్లిళ్లు, ఉచిత భోజనాలు కాదని, మౌలిక సదుపాయాల కల్పన అని ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు తీర్పునిచ్చారని పేర్కొన్నారు. గత పాలకులు విస్మరించిన కేఎల్‌ఐ పెండింగ్ పనులు, పరిశ్రమల, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల ఏర్పాటు పాటు అభివృద్ధి పనులను పూర్తి చేయాలని కోరారు. సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు హెచ్.ఆనంద్‌జీ, వార్ల వెంకటయ్య, కేశవు లుగౌడ్, నాయకులు కందాల రామకృష్ణ, ఎండీ.ఫయాజ్, ఏసయ్య, కాంగ్రెస్ కౌన్సిలర్లు శ్రీనివాసులు, నిజాముద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద యువతకు ఆదర్శం

- ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి



స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే

నాగర్‌కర్నూల్ టౌన్, జనవరి 12: స్వామి వివేకానంద జీవితం యువతకు ఆదర్శమని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి రాంనగర్‌కాలనీలోని స్వామి వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కౌన్సిలర్లు కావలి శ్రీనివాసులు, జక్కా. రాజవర్ధన్‌రెడ్డి, నిజాముద్దీన్, బాదం సునిత నరేందర్, కాంగ్రెస్ నాయకులు నాయకులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

● విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద చిత్ర పటానికి జిల్లా అధ్యక్షుడు జె.రాంచంద్రారెడ్డి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి వెంకటశెట్టి, నాయకులు బుసిరెడ్డి సుధాకర్‌రెడ్డి, యుగంధర్‌రెడ్డి, శ్రీనివాసులు, రాములు, నరసయ్య, కృష్ణయ్య, పాండురంగయ్య, వీరేశలింగం, జగన్మోహన్‌రావు, జగన్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

● సమీకృత కలెక్టరేట్‌లోని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద చిత్ర పటానికి డీఈవో గోవిందరాజులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా సైన్స్ అధికారి కృష్ణారెడ్డి, సెక్టోరియల్ అధికారులు షర్ఫుద్దీన్, నూరుద్దీన్, మురళీధర్ రెడ్డి, ఎస్‌పీసీ ప్రసాద్‌గౌడ్, రవినాయక్ పాల్గొన్నారు.

● తిమ్మాజిపేట: స్వామి వివేకానందుడు యువతకు ఆదర్శమని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బంగారుశ్రుతి అన్నారు. తిమ్మాజిపేట మండల పరిధిలోని ఆవంచలో యువ జాగృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెతో పాటుగా పలువురు బీజేపీ శ్రేణులు స్వామి వివేకానందుడి విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. స్వామి వివేకానందుడు యువతకు స్ఫూర్తి ప్రదాత మార్గదర్శి అని భారతదేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిన చైతన్య మూర్తి అంటూ ఆమె కొనియాడారు. దేశభక్తి ఆధ్యాత్మికత భారత సంస్కృతీ సంప్రదాయాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. అదేవిధంగా తిమ్మాజిపేట మండల కేంద్రంలో జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ వేణుగోపాల్‌గౌడ్, ఎంపీటీసీ సభ్యులు లీలావతి, శారద, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, యువకులు పాల్గొన్నారు.



గంగారంలో రక్తదానం చేస్తున్న యువకులు



ఆవంచలో స్వామి వివేకానందుని విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న బంగారుశ్రుతి

● అమ్రాబాద్: భారతదేశ ఖ్యాతిని ప్రపంచం నలుమూలలకు చాటిన స్వామి వివేకానంద జయంతిని అమ్రాబాద్ మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అమ్రాబాద్ మండల కేంద్రంలో స్వామి వివేకానంద విగ్రహం వద్ద యూత్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ పాల్గొని వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళు అర్పించారు. అమ్రాబాద్ వివేకానంద యూత్ కమిటీ అధ్యక్షులు నోముల పరమేశ్వర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి గోలి లింగం, ఏకల్ గ్రామోత్తన్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ మడ్డి హరీష్ గౌడ్ యూత్ కమిటీ నాయకులు తో పాటు ప్రజా ప్రతినిధులు, అధికారులు, రాజకీయ పార్టీల నేతలు పాల్గొన్నారు

● కల్వకుర్తి: యువత స్వామి వి వేకానందను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ కోరారు. కల్వకుర్తి పట్టణంలో క్లాస్‌మేట్ క్లబ్, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా బచ్చు రామకృష్ణ మాట్లాడుతూ సమాజంలో మార్పు కోసం ప్రతీ ఒక్కరు పని చేయాలని పేర్కొన్నారు. లయన్స్‌క్లబ్ గవర్నర్ రమేష్‌బాబు, లయన్స్‌క్లబ్ నాయకులు, క్లాస్‌మేట్ క్లబ్ జిల్లా కార్యదర్శి లక్ష్మినరసింహరావు, శోభన్‌బాబు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కల్వకుర్తి పట్టణంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. కళాశాలలు, సంఘాలు, యువజన సంఘాల ఆధ్వర్యంలో స్వామి వివేకానంద చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. సావిత్రిబా యిఫులే ఒకేషనల్ జూనియర్ కళాశాలలో రాజేందర్ ఆధ్వర్యంలో యువజనోత్సవాలు జరుపుకున్నారు.

● తెలకపల్లి: మండల కేంద్రంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను శుక్రవారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించుకున్నారు. స్థానిక వివేకానంద చౌరస్తాలో ఉన్న వివేకానంద విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అక్కడ చేరుకున్న వక్తలు మాట్లాడుతూ స్వామి వివేకానంద ప్రపంచ యువతకు ఆదర్శప్రాయమని ఆయన అడుగుజాడల్లో నడవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారన్నారు. హిందూ మతం ఒక మతం కాదని ఒక జాతి, ధర్మం అని దానిని అందరూ పాటించాల్సినవసరం ఉందని ఆయన చికాగో నగరంలో జరిగిన సర్వమత సమ్మేళనంలో చాటి చెప్పారు. ఉమాపతి, శివ, నరేంద్రచారి బాబుసాగర్, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరి ప్రాణ దాతలు కావాలి

● బిజినేపల్లి: యువత రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి ప్రాణదాతలు కావాలని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ సెక్రెటరీ రమేష్ రెడ్డి అన్నారు. మండలంలోని గంగారంలో స్వామి వివేకానంద జయంతి పురస్కరించుకొని రెడ్‌క్రాస్, సోషల్ రెస్పాన్సిబిలిటీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన స్వచ్ఛంద రక్తదాన శిబిరంలో 56 మంది గ్రామ యువత రక్తదానం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాల్లో గాయపడిన వారికి, ప్రసూతి సమయంలో రక్తం తక్కువగా ఉన్న వారికి రక్తం కొరత లేకుండా చూడాల్సిన సామాజిక బాధ్యతగా ప్రతీ ఒక్కరు రక్తదానం చేయాలని కోరారు. వృద్ధులకు సంచార వైద్య సేవల ద్వారా రక్త, మూత్ర పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేసినట్లు తెలిపారు. గ్రామ యువకులు హరీశ్వర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, శ్రీనువాసులు, యూత్ రెడ్‌క్రాస్ జిల్లా కన్వీనర్ డి.కుమార్, సభ్యులు రమేష్, లక్ష్మణ్, వైద్యాధికారి డాక్టర్ బొల్లం శ్రీకాంత్, యూసఫ్ నవీద్, ఎంపీహెచ్ఈఓ శ్రీధర్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

● ఊర్కొండ: స్వామి వివేకానంద ఆశయ సాధనలో భాగస్వాములం అవుదామని నవభారతి అసోసియేషన్ అధ్యక్షుడు మాజీ సర్పంచ్ మ్యాకల శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో మాజీ స్వామి వివేకానంద జయంతి వేడుకలను నవభారతి అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ముచ్చర్ల జనార్దన్ రెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ కలిమ్ పాషా, హెడ్ కానిస్టేబుల్ వెంకోజీ, నాయకులు భగవాన్ గౌడ్, శివ రాంరె డ్డి, లక్ష్మారెడ్డి, శ్రీశైలం, నరసింహ్మ, నరేష్ ఉన్నారు.

● పెద్దకొత్తపల్లి: మండల కేంద్రమైన యూనివర్సల్ యూత్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దకొత్తపల్లి బస్టాండ్ చౌరస్తాలో స్వామి వివేకానంద చిత్ర పటాన్ని ఏర్పాటు చేసి పలువురు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. యూనివర్సల్ యూత్ అధ్యక్షుడు జి.వెంకటయ్య, ఉపాధ్యక్షుడు నాగరాజు, కోశాధికారి కే.పరమేష్, సభ్యులు పృథ్వీరాజ్, బి.నాగరాజు, బి.మహేష్, ఓంకార్, రఘువర్ధన్‌రెడ్డి, శ్యాంసుందర్‌రెడ్డి, కృష్ణం రాజు తదితరులు పాల్గొన్నారు.

● పెంట్లవెల్లి: స్వామి వివేకానంద జ్ఞాపకశక్తి అమోఘమైందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకునమోని రాముయాదవ్ అన్నారు. కొల్లాపూర్ మండలం రామపురం గ్రామంలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. నాయకులు శ్రీరాములు, ఆకునమోని చంద్రయ్య, శేఖ రొరెడ్డి, దర్గయ్య, ఉడతరామస్వామి, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

● అచ్చంపేట: పట్టణంలోని బస్టాండ్ ఆవరణలో గల అమర వీరుల స్థూపం వద్ద క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో స్వామి వివేకానందుడి జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచంలోనే ఎత్తైన ఆఫ్రికా ఖండంలోని కిలిమంజారో ఉన్నత శిఖరాన్ని అధిరోహించబోతున్న నల్లమల వాసి చిట్లంకుంట గ్రామానికి చెందిన జైరాంకు క్లాస్‌మేట్ క్లబ్ తరపున రూ.5000 నగదును అందజేసి ఘనంగా సన్మానించారు. క్లాస్‌మేట్ క్లబ్ అధ్యక్షుడు మురళి, ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, రమేష్, శ్రీనివాస్, బిచ్యానాయక్, వెంకటరాజు, గోపాల్ నాయక్ పాల్గొన్నారు.

● లింగాల: మండల పరిధిలోని అప్పాయిపల్లి, కోమటికుంట గ్రామాల్లో శుక్రవారం స్వామి వివేకానంద జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు నలేశ్వరం, అశోక్, ప్రసాద్, నవీన్, శ్రీరాం, బాలయ్య, ఎండీ జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

● మన్ననూర్: అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో వివేకానంద జయంతి వేడుకలను వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పలువురు ప్రజా ప్రతినిధులు, గ్రామస్థులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ సర్పంచ్ శ్రీరాం నాయక్, ఎంపీటీసీ దాసరి శ్రీనివాసులు, కోఆప్షన్ సభ్యుడు రహీమ్, ఆర్యవైశ్య సంఘం రీజినల్ చైర్మన్ జూలూరి సత్యనారాయణ, వివేకానంద యువజన సంఘం నాయకులు చంద్రమౌళి, బాలకృష్ణ, అభిషేక్, రమేష్, శ్రీనివాసులు, శివ, సతీష్, శ్రీకాంత్, పార్టీల నాయకులు పాల్గొన్నారు.



కల్వకుర్తిలో వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు బచ్చు రామకృష్ణ

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి

- కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

నాగర్‌కర్నూల్, జనవరి 12 (ఆంధ్రజ్యోతి) : రాబోయే వేసవిలో జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాలు, మునిసిపాలిటీల్లో నీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్ మిషన్‌భగీరథ అధికారులను ఆదేశించారు. తాగునీటి వేసవి ప్రణాళికపై శుక్రవారం నాగర్‌కర్నూల్ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ మీటింగ్ హాల్‌లో ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ, విద్యుత్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నాలుగు మునిసిపాలిటీల్లో 86వార్డులు, 20మండలాల్లోని 726 గ్రామాల్లో నీటి వనరులను ఒక్కో ఏఈవో కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఏ గ్రామంలో ఏ సమస్యతో తాగునీరు సరఫరా కావడం లేదు అందుకు కావాల్సిన మరమ్మతుల నిధుల అంచనాను సైతం సమావేశంలో కలెక్టర్ నిర్ధారించారు. జిల్లా వ్యాప్తంగా ఎక్కడైనా గ్రామాల్లో మరమ్మతులకు అవసరమైన పనులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పైపులను ఇతర చిన్న చిన్న మరమ్మతులకు కావాల్సిన రూ.కోటి 50లక్షల నిధులను మంజూరు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఎక్కడైనా గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఉంటే వెంటనే ఏర్పాటు చేయాలని విద్యుత్ శాఖ ఎస్సీ లీలావతిని కలెక్టర్ ఆదేశించారు. గ్రామాల్లో పని చేసే లైన్‌మెన్లు నీటి వృథా కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు.

నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా ప్రతి రోజుకు గ్రామస్థాయిలో 100లీటర్లు, పట్టణ స్థాయిలో 135లీటర్ల చొప్పున తాగునీటిని అందించాలని, ఒక నెలకు 0.7టీఎంసీ నీరు జిల్లాలో తాగునీటి అవసరాలకు తప్పనిసరిగా వినియోగించాలని కలెక్టర్ సూచించారు. రానున్న ఏడు మాసాల పాటు తాగునీటి అవసరాలకు కావాల్సిన ఐదు టీఎంసీలన్నింటినీ శ్రీశైలం రిజర్వాయర్లు ఉండేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రస్తుతం శ్రీశైలం రిజర్వాయర్లు 827.9లెవల్‌లో 47.44టీఎంసీల నీరు నిల్వ ఉన్నాయని అందులో 31టీఎంసీల వరకు డెడ్ స్టోరేజీగా పరిగణించబడుతుందని అందుకనుగుణంగానే రానున్న వేసవి తాగునీటి అవసరాలకనుగుణంగా రిజర్వాయర్లు నీటి లభ్యత ఉండేలా పర్యవేక్షించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

అదనపు కలెక్టర్ లోకల్‌బాడీ కుమార్‌దీపక్, మహబూబ్‌నగర్ సర్కిల్ మిషన్‌భగీరథ సూపరింటెండెంట్ ఇంజనీర్ కే వెంకటరమణ, జిల్లా పంచాయతీ అధికారి కృష్ణ, ఎలక్ట్రిసిటీ ఎస్సీ లీలావతి, మిషన్‌భగీరథ ఈఈలు శ్రీధర్‌రావు, సుధాకర్‌సింగ్, మిషన్‌భగీరథ డీఈలు హేమలత, మల్లేశ్వర్‌రావు, సురేష్, సుదర్శన్, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

విద్య ద్వారానే సమాజంలో అసమానతలు దూరం



డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులతో ఎమ్మెల్యే

అమ్రాబాద్ జనవరి 12: నేటి ఆధునిక సమాజంలో విద్య ద్వారానే సాంఘిక అసమానతలు రూపుమాపడం జరుగుతుందని, స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకొని ప్రతి విద్యార్థి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. అమ్రాబాద్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కమ్యూనిటీ డెవలప్మెంట్ ఫౌండేషన్ సహకారంతో రూ.8లక్షలతో విద్యార్థుల తాగునీటి అవసరాలు తీర్చడం కోసం నూతనంగా కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంటును శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. డిగ్రీ కళాశాల మౌలిక సదుపాయాల కల్పన కోసం ప్రభుత్వం ద్వారా కోటి రూపాయలతో సీసీ రోడ్డు, ప్రహరీ నిర్మాణం ఇతర సదుపాయాలను కల్పించనున్నట్లు ఆయన హామీ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపల్ మదన్ మోహన్ ఆధ్వరంలో అధ్యాపకులు, విద్యార్థులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కమ్యూనిటీ డెవలప్మెంట్ స్టేట్ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, టెక్నికల్ అధికారి సంతోష్, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జూనియర్ కళాశాలలో అతిథి అధ్యాపకులుగా పనిచేస్తున్న తమకు ప్రభుత్వం నుంచి వేతనాలు అందించే విధంగా కృషి చేయాలని ఆ సంఘం నేతలు ఎమ్మెల్యే వంశీకృష్ణకు వినతి పత్రం అందజేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి వేతనాలు అందే విధంగా చూస్తానని వారికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఉమ్మడి మండలం సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన అన్నారు. అదేవిధంగా అమ్రాబాద్ నుంచి మద్దిమడుగు వరకు రహదారి విస్తరణ పనుల కోసం 75 కోట్ల రూపాయలు ప్రభుత్వం నుంచి కేటాయించనున్నట్లు ఎమ్మెల్యే ఈ సందర్భంగా వెల్లడించారు.

ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధికి రూ.25వేలు విరాళం

పెద్దకొత్తపల్లి, జనవరి 12 : మండల పరిధిలోని ముష్టిపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయ అభివృద్ధి పనుల కోసం ఆ గ్రామానికి చెందిన దివంగత పొట్లపల్లి బక్కయ్య, దివంగత పొట్లపల్లి నరసింహ, దివంగత పొట్లపల్లి శేఖరయ్య, దివంగత పొట్లపల్లి భగవంతు, దివంగత పొట్లపల్లి బసవయ్యల జ్ఞాపకార్థంగా వారి కుమారులు 25వేల రూపాయల నగదును విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి కోసం విరాళాలిచ్చేందుకు దాతలు ముందుకురావాలని వారు కోరారు.

వైభవంగా కుడారై ఉత్సవం

బిజినేపల్లి, జనవరి 12 : మండలంలోని వట్టెం వెంకన్న ఆలయంలో శుక్రవారం ధనుర్మాసం ఉత్సవాల్లో భాగంగా అత్యంత పవిత్రమైన కుడారై ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. దేవస్థాన ప్రధాన అర్చకులు కారంపూడి కృష్ణమాచార్యులు, నరసింహచార్యులు, తివారి, విజయ్ స్వాముల అర్చకత్వంలో శాస్త్రోక్తంగా కుడారై ఉత్సవాన్ని చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు గోదాదేవి అమ్మవారికి 108 గంగాలాలలో ప్రసాదాలను సమర్పించి ధనుర్మాస విశిష్టతను వివరించారు. దేవాలయ అభివృద్ధి కమిటీ సభ్యులు కొర్ర చంద్రారెడ్డి, గుబ్బ సత్యనారాయణ, జయపాల్ రెడ్డి, శ్రీనివాసులు, మావిళ్ల రామకృష్ణ, అనురాధ, వెంకట నారాయణ, రామతేజ, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

సర్పంచ్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

కల్వకుర్తి, జనవరి 12: కల్వకుర్తి మండలం పంజుగుల గ్రామ సర్పంచ్ పద్మ సస్పెన్షన్‌ను కలెక్టర్ ఎత్తివేశారు. శుక్రవారం అందుకు సంబంధించిన ఉత్తర్వులను సర్పంచ్ పద్మకు అందజేయడంతో ఆమె విధుల్లోకి చేరారు. అనంతరం ఎంపీడీవో ఆంజనేయులు, ఎంపీవో దేవేందర్‌ల సమక్షంలో సర్పంచ్‌గా బాధ్యతలు తీసుకున్నారు.

వెంచరు పనులు నిలిపివేత

ఊర్కొండ, జనవరి 12: అనుమతులు రాకుండానే వెంచరు ఏర్పాటు చేయడం అక్రమమని వెంటనే పనులు నిలిపివేయాలని నోటీసులు జారీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి మోతీలాల్ శుక్రవారం తెలిపారు. మండల కేంద్రంలో సర్వే నంబరు 401, 402లలో డీటీసీపీలే అవుట్ టీఎల్పీ నంబరు లేకుండా అభివృద్ధి పనులు చేయడం పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం నేరమని, వెంటనే పనులు నిలివేయడంతో పాటు పాతిన జెండాలు తొలగించాలని ఏస్వీ ఇన్‌ఫ్రా డెవలపర్స్‌కు నోటీసులు జారీ చేశామని అన్నారు. అనుమతులు వచ్చే వరకు వెంచరులో ఎలాంటి అభివృద్ధి పనులు చేయరాదని పేర్కొన్నారు

అభయుడి కార్యనిర్వహణాధికారిగా సత్యచంద్రారెడ్డి

ఊర్కొండ, జనవరి12: మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయ స్వామి ఆలయం కార్యనిర్వహణాధికారిగా సత్యచంద్రారెడ్డి నియామకం జరిగినట్లు దేవాదాయ, ధర్మాదాయ శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడినట్లు ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వహిస్తున్న కార్యనిర్వహణాధికారి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. రెండు రోజుల్లో బాధ్యత అప్పగిస్తామన్నారు.

అవినీతి లేని పాలన అందించడమే లక్ష్యం: ఎమ్మెల్యే

అభయాంజనేయస్వామి ఆలయం నిర్వహణలో ఆదాయ వ్యయాల్లో అవినీతి ఆరోపణలు రావడంతో తన దృష్టికి స్థానిక నాయకులు తీసుకువచారని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. తక్షణమే స్పందించి కార్యనిర్వహణాధికారిని మార్చినట్లు పేర్కొన్నారు. అభయాంజనేయ ఆలయంలో అవినీతి లేని పాలనఅందించాలని కృత నిశ్చయంతో ముందుకు వెళతున్నామని భక్తులు సహకారాన్ని అందించాలని ఎవరికి ఎలాంటి ఇబ్బందులున్నా వెంటనే తనకు తెలియజే యాలని కోరారు. మా పార్టీ నాయకులు తప్పు చేసిన వదిలేదులేదని ఆయన తెలిపారు.

ఇంటర్‌బోర్డు కమిషనర్‌ను కలిసిన గెస్ట్ లెక్చరర్లు



ఇంటర్ బోర్డు కమిషనర్‌ను కలిసి సన్మానిస్తున్న గెస్ట్ లెక్చరర్లు

కల్వకుర్తి, జనవరి 12 : ఇంటర్మీడియట్ బోర్డు నూతన కమిషనర్‌గా నియమితులై శృతిఓఝాను గెస్ట్‌లెక్చరర్లు పూల మాలలు, శాలువాలతో సత్కరించారు. అతిథి అధ్యాపక సంఘం రాష్ట్ర నాయకులు సదానందంగౌడ్, యాకుబ్ బాషాలు కమిషనర్‌ను పూల మాలలు శాలువాలతో సత్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ అతిథి అధ్యాపకులను కంటిన్యూయేషన్‌చేస్తూ వేతనాలు నెలనెలా అందించాలని కోరడం జరిగిందని వారు తెలిపారు. కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కృష్ణ, బాలకృష్ణగౌడ్, భీమేష్, గిరిబాబు తదితరులు ఉన్నారు.